# కామ పిశాచం

గౌరి పుట్టింది నక్రేకల్లులో. గౌరి పెరుగుతున్నకొద్ది నక్రేకల్లు పట్నంలా పెరిగింది. అక్కడ దొరకని వస్తువు లేదు. స్కూలు కాలేజీలు వెలిసాయి. ఒక గవర్నమెంటు దవాఖానా పోగా రెండు ప్రైవేటు దవఖానాలు వచ్చాయి. రెండు సినిమాహాళ్లు వున్నాయి.

"అక్కడేం తక్కువని రెండు మూడు దవాఖానాలున్నాయి. నా కూతురు మొదటి కాన్పు ! దాన్ని మా ఊరికే తీస్కపోతాను" అంది గౌరి తల్లి వీరమ్మ.

గౌరి భర్త వెంకటయ్యకు అది అసలే నచ్చలేదు. గౌరిక్కూడా పట్నంలోనే భర్త దగ్గర వుండాలని కోరిక. తను నీళ్ళాడుతుంటె తన భర్త తన దగ్గరే పక్కనే వుంటె బాగుండునని వుంది ఆమెకు. కాని ఆ కోరికను తలిదండ్రులకు చెప్పలేకపోయిందామె. పైకి చెప్తే ఎవరేమనుకుంటారోమోనని జంకింది గౌరి. సిగ్గులేదు లజ్జలేదు అని అంటారు అందరూ అనుకుంది గౌరి.

"ఇదెక్కడి పరిస్థితి. భార్యాభర్తలు తమకు ఒకరి మీద ఒకరికున్న ప్రేమను అందరికీ తెలిసే టట్లుగా చెప్పుకోలేరు! బిడ్డ పుట్టినప్పుడు ఆ బిడ్డ తండ్రి తన దగ్గరుండాలనే కోరికను తల్లిపైకి చెప్తే తప్పు ! ఇదెక్కడి న్యాయం!" గౌరి మనస్సులోనే బాధపడింది.

"మొదటి కాన్పు తల్లిగారింట్లో కావడం అనాది నుంచి వస్తున్న ఆచారం! అది కాదని దిక్కులేనిదాని లెక్క నీకేం ఖర్మ! ఇక్కడ అత్తగారింట్లో పురుడు పోసుకుంటావా? గౌరి తల్లీ!" అన్నాడు తండ్రి లక్ష్మయ్య.

"అయినా నువ్వు పట్నంలో పురుడు పోసుకుంటె మేము ఎన్నాళ్ళని ఇక్కడుం టామె గౌరీ!" అంది వీరమ్మ. కూతురు కాన్పుకని వచ్చి తలిదండ్రులు ఎన్నాళ్ళని అల్లునింట్లో వుంటారని ఆమె బాధ.

"డాక్టరమ్మ కాన్పు అయ్యే తారీఖు చెప్పింది గదమ్మా!" అంది గౌరి.

"అయ్యో బిడ్డా! డాక్టరమ్మ ఇచ్చిన తారీఖుకు కాన్పు అయితదని నమ్మకమేందే. నీ కాన్పుకు ఎదిరి చూసుకుంట ఎన్నాళ్ళనీ వుంటమిక్కడ నేనూ మీ నాయిన! పద అక్కడే పురుడు పోసుకుందువు గాని" అని బలవంతపెట్టింది వీరమ్మ కూతురును.

"నలుగురు నాలుగువిధాలా అనుకుంటారు తల్లీ! ఎందుకీ బద్నాం. పద అక్కడ్నే తల్లి గారింట్లనే పురుడు పోసుకుందువుగాని!" అన్నాడు లక్ష్మయ్య కూతురుతో ప్రాధేయ పడ్తున్నట్లుగా.

ఇక గౌరి ఏ వంకబెట్టి తల్లిగారింటికి పోకుండ తప్పించుకోలేకపోయింది.

గౌరి వెంకటయ్యల పెళ్ళయి ఏడాదిన్నరయింది. ఈ ఏడాదిన్నరలో బతుకమ్మ దసరా, దీపావళి పండుగలకు మాత్రమే గౌరి తల్లిగారింటికి పోయింది. ఆ పండుగలకు ఆమెతోపాటు అల్లున్నీ తీసికెళ్ళారు ఆమె తలిదండ్రులు. ఆ తర్వాత ఎప్పుడూ భర్తను ఒదిలి తల్లిగారింటికి గాని మరెక్కడికిగాని పోలేదు. తండ్రి వచ్చి గౌరిని తీసుకపోతానన్నా గౌరి పోలేదు. తండ్రితో

"నాయినా! నేను లేకపోతె ఆయనకు వంటకు తిప్పలయితది. నేను రాను" అంది స్పష్టంగా.

"నిజమే! అల్లునికి ఎన్కాముందూ ఎవరూ లేరైరి. అది లేకపోతె నిజంగనే అల్లునికి తిప్పల యితది!" అనుకున్నాడు లక్ష్మయ్య. ఒక్కడే తిరిగి వెళ్ళిపోయాడు.

ఊరికి పోయింతర్వాత భర్తనొక్కన్నే చూసి వీరమ్మ కూతురు రానందుకు బాధపడింది. "అదేందయ్యా! అట్లంటవు! పెండ్లికి ముందల ఒక్కడే లేడ! ఏందో దానికి తల్లిగారింటి మీదికి మనసు గుంజనే గుంజదు. అదేం చిత్రమో!" వీరమ్మ విచారంతో నిట్టూర్చింది.

గౌరి వాళ్ళకు ఒక్కతె కూతురు. నలుగురు కొడుకుల తర్వాత పుట్టిందామె. అందుకే వీరమ్మకు కూతురంటె ప్రేమ.

పెళ్ళయిన నాటి నుంచి గౌరి వెంకటయ్యల మనస్సులు గాఢంగా పెనవేసుకొని పోయాయి. ఒకర్ని విడిచి ఒకరు వుండలేని పరిస్థితి వాళ్ళది. వెంకటయ్య బ్యాంకులో పని చేస్తున్నాడు. బ్యాంకు టైం అయిపోగానే వెంకటయ్య చక్కగా ఇంటికే వస్తాడు. ఎప్పుడైన రోడ్డు మీది ట్రాఫిక్కు వల్లనో బ్యాంకులో పని వల్లనో తోడెం (కాస్త) ఆలస్యమైనా గౌరి మనస్సు ఏమేమో ఊహించుకొని గిలగిల్లాడిపోతుంది. బ్యాంకు నుంచి రాగానే ఎదురుగా గౌరి లేకపోతె వెంకటయ్య గుండె విలవిల్లాడి పోతుంది. ఇద్దరి ప్రేమానుబంధం అటువంటిది.

వెంకటయ్యకు ఏ అలవాట్లు లేవు. కాని వారానికో సినిమా రెండు సినిమాలు చూడడం అలవాటు అతనికి. అది గౌరితో చూడడం అతనికి చాలా ఇష్టమైన హాబీగా తయారైంది పెళ్ళయిం తర్వాత.

వెంకటయ్య బ్యాంకు నుంచి రాకముందే గౌరి రాత్రి వంట చేసి పెడ్తుంది. రాగానే వెంకటయ్య తినడానికి రోజుకో రకం అప్పాలో బజ్జీలో చేసి తయారుగా పెడ్తుంది. చాయ్ అంతకు ముందే చేసి ఫ్లాస్కులో పోయడం గౌరికిష్టం లేదు. ఎంత బాగా కడిగినా ఫ్లాస్కులో పోసిన చాయ్ రబ్బరు కంపు కొడ్తదని వెంకటయ్య వచ్చింతర్వాతనే అప్పటికప్పుడు చాయ్ చేసి వేడివేడిగా ఇస్తుంది గౌరి. ప్రేమతో అతనికి తినిపిస్తుంది. తాగిస్తుంది. ఆ తర్వాత ఇద్దరూ కలిసి సినిమాకో షాపింగుకో వెళ్తారు. పెళ్ళికి ముందు గౌరికి సినిమాలు చూడడం అలవాటు లేదు. భర్త వల్లనే ఆమెకు సినిమాల మీద మోజు కలిగింది.

పెళ్ళయినాక మొదటి రాత్రే వెంకటయ్య గౌరితో అన్నాడు. "నీ పేరు చాల పాతకాలపు పేరులాగా ఉంది. నిన్ను నేను గౌరి అని కాక 'రాణి' అని పిలుస్తాను."

గౌరి వింతగా వెంకటయ్య వైపు గుడ్లప్పగించి చూసింది. "నువ్వేమో నన్ను 'రాజా' అని పిలవాలి! తెలిసిందా" అడిగాడు వెంకటయ్య. సిగ్గుతో సరే అన్నట్లుగా తలూపింది గౌరి. ఆనాటి నుంచి వాళ్ళిద్దరూ "రాజా-రాణీ" అని ఒకరినొకరు పిలుచుకోవడం మొదలైంది. కాని ఎవరైన వుంటే మాత్రం వెంకటయ్య గౌరిని "ఏమే! వున్నావా?" అనే పిలిచేవాడు.

గౌరి ఎవరైన వుంటె భర్తను సంబోధించేదే కాదు.

వెంకటయ్యకు బంధువుల్లేరనే చెప్పాలి. తలిదండ్రులు చిన్ననాడే చనిపోయారు. చిన్నమ్మ దగ్గర పెరిగి పెద్దవాడయ్యాడు. ఇప్పుడా చిన్నమ్మ యీ లోకంలో లేదు. వెంకటయ్యకు స్నేహితులు తక్కువే. గౌరి ఆప్యాయత వెంకటయ్య అనురాగంతో వాళ్ళ అనుబంధం ఇంకా పెనవేసుకపోయింది.

★ ★ ★

తలిదండ్రుల అనురాగాగ్రహాన్ని తోసిపుచ్చలేక గౌరి చివరకు తల్లిగారింటికి కాన్పుకు పోయింది. కాని ఆమె మనస్సంతా వెంకటయ్య దగ్గరే.

డాక్టరమ్మ చెప్పిన తారీఖుకు గౌరి నీళ్ళాడలేదు. వెంకటయ్య ఆ తారీఖునాడు వచ్చి అత్తగారింట్లో నాలుగురోజులుండిపోయాడు.

"ఎన్నాళ్ళని వుంటారు! అక్కడ బ్యాంకులో లీవులన్నీ అయిపోతయి. మీరు వెళ్ళండి. కాన్పు కాంగనే నేను వచ్చేస్త" అని గౌరి వెంకటయ్యను పంపించేసింది.

"ఇంత దూరం వచ్చిన. భార్య కాన్పు అయ్యేటప్పుడు దగ్గరుండే అవకాశం లేక పోయిందే!" అని వెంకటయ్య బాధపడ్డాడు.

"అయినా కాన్పు అయ్యే సమయానికి నేనిక్కడున్నా నన్ను కాన్పు అయ్యే దగ్గరికి రానిస్తరో లేదో!" అనుకున్నాడు విచారంగా వెంకటయ్య.

"పట్నంలో కాన్పయితే కనీసం నేను దవాఖానాలో దగ్గరిలోనైన వుంటుంటిని!"

బాధగా అనుకున్నాడు వెంకటయ్య.

గౌరికి అదే కోరిక....'' బిడ్డ పుట్టేటప్పుడు రాజా నా దగ్గరే, పక్కనే వుండి నా చేతులు పట్టుకొని నిలబడ్తే ఎంత బాగుండును!'' అనుకుంది గౌరి.

"కాని అది సాధ్యమా! ఆడదానికి కాన్పయ్యేటప్పుడు మగోల్లను అ(ర దగ్గరికే రానియ్యరు. ఇగ మొగున్ని కూడా దగ్గరికి రానియ్యరు! అదేం ఆచారమో!'' విచారంగా అనుకుంది గౌరి.

వెంకటయ్య వెళ్ళిపోయిన రెండు రోజులకు సాయంత్రం గౌరికి నొప్పులు మొదలయ్యాయి. వెంటనే ఆమెను దవాఖానాకు తీసుకపోయారు. డాక్టరమ్మ పరీక్ష చేసి "ఇప్పుడప్పుడే కాన్పుకాదు'' అంది.

గౌరి నొప్పులతో బాధపడ్తుంటె వీరమ్మ లక్ష్మయ్యలకు దిక్కుతోచలేదు.

"ఇవెక్కడి మాయదారి నొప్పులో! కాన్పు ఎప్పుడైతదొ ఏందో!'' అనుకొని "తొందరగా కాన్పు కావాలె దేవుడా!' అని మొక్కుకుంది వీరమ్మ.

కొంతసేపటికి డాక్టరమ్మ వచ్చి గౌరిని మళ్ళా పరీక్ష చేసింది. "కడుపులో బిడ్డ అడ్డంగా తిరిగాడు. ఆపరేషను చేసి బిడ్డను తీస్తాను'' అంది డాక్టరమ్మ.

"వెంటనే ఆపరేషను చేయాలి'' అని తొందరపెట్టింది డాక్టరమ్మ.

ఆపరేషనుకు క్షణంలో తయారీ జరిగింది. గౌరికి నొప్పు లెక్కువయ్యాక స్పృహలేని పరిస్థితి ఏర్పడింది. ఆ స్పృహలేని స్థితిలో ఆమె "రాజా! రాజా!'' అని కలవరించడం మొదలు పెట్టింది. ఆపరేషను కోసం మత్తు ఇచ్చేంతవరకు ఆమె "రాజా! రాజా!'' అని కలవరిస్తూనే వుంది.

గౌరిని పరీక్ష చేసి డాక్టరమ్మ బయటికి వచ్చి "రాజా ఎవరమ్మ? ఆ అమ్మాయి ఒక్కటె కలవరిస్తున్నది!'' అని అడిగింది వీరమ్మను.

రాజా ఎవరో అర్థంకాక వీరమ్మ శూన్యంగా చూసింది. పక్కనే వున్న ఆమె నలుగురు కోడండ్లు ఒకరి మొఖం ఒకరు విచిత్రంగా చూసుకున్నారు.

లోపలికి డాక్టరమ్మ పోయిన కాస్సేపటికే నర్సు బయటికి వచ్చింది.

"ఆపరేషనయింది. మగబిడ్డ! ఆమె ఇంకా సోయిలోకి రాలేదు'' అని చెప్పి వెంటనే లోపలికి వెళ్ళిపోయింది.

ఇంతలో ఇంకో నర్సు బయటికి ఉరుక్కుంటు వచ్చింది.

"రాజా ఎవరమ్మ? ఆమె రాజాను చూస్తనంటున్నది. ఒకటే కలవరిస్తున్నది ఆయన కోసం'' అని అడిగింది.

అందరూ ఒకరి ముఖం ఒకరు అర్థం కానట్లుగా చూసుకున్నారు. అంతకుముందే

గౌరికి నొప్పులు మొదలుకాగానే వెంకటయ్యను రమ్మని టెలిగ్రాం ఇచ్చారు. "ఈపాటికి అల్లుడు బయలుదేరి వుంటాడు. కాస్సేపట్లో ఆయన వస్తాడు. ఇదేం అప్రతిష్ఠ! అత్తా! ఈమెమో ఎవరి పేరో పెట్టి కలువరిస్తున్నది!" అంది పెద్దకోడలు వీరమ్మతో.

ఇంతలో మొదటి నర్సు బయటికి వచ్చింది. "మీ బిడ్డ ...." పూర్తి చేయకుండానే ఆగింది.

"గౌరికెట్లుంది?" ఆత్రుతగా అడిగింది వీరమ్మ.

విషాదం కమ్మిన ముఖంతో "మత్తునుంచి ఆమెకు పూర్తిగా మెలకువే రాలేదు. ఆ మత్తులో కూడా రాజా! రాజా! అని కలవరిస్తూనే ప్రాణాలు విడిచింది" అని చెప్పింది ఆ నర్సు.

"రాజా! ఎవరు? ఏదో కామపిశాచం పట్టుకుంది నా బిడ్డను. లేకపోతె మంచిగున్న నా బిడ్డ ఎందుకు పోతది ఇట్ల హఠాత్తుగ!" అని ఏడ్వడం మొదలుపెట్టింది వీరమ్మ.

"ఇదేం అప్రతిష్ఠ! ఎవరి పేరును తలసుకుందో యేమో! పట్నంలో ఎవరితోటి దోస్తీ అయిందో ఈమెకు! అవ్వ ! మొగనికి తెలిస్తే ఏమనుకుంటడు!" అంది పెద్దకోడలు.

"ఇంతమంది కాన్పులు చూసినం గాని ఇట్ల మగోళ్ళను పేరుపెట్టి పిల్వంగ ఎక్కడ సూడలేదు! తప్పకుంట ఏ కామపిశాచమో పట్టింది. అదే ఆమెను ఎత్తుకపోయింది!" అంది వీరమ్మ రెండో కోడలు.

"అంతేమరి! ఆ పిశాచం పట్టినోళ్ళే యిట్ల మగోళ్ళ పేరు జపించుకుంటు పోతరు! ఈ ముచ్చట అల్లునికి చెప్పకుండ్రి. ఆయనకి తెలిస్తే ఏమనుకుంటడో ఏందో?" అంది వీరమ్మ మూడో కోడలు.

"ఈ సోద్యం ఎక్కడా సూడలేదు వినలేదు! ఆ రాజాగాడు ఎవరో ఏందో? అట్ల పేరు తలుసుకుంట పోయిందంటె ఆయనతో ఆమెకు దోస్తి బాగనే అయివుంటది!" అంది నాలుగో కోడలు పెదవులు విరుస్తూ.

"ఏమయిన ఈ సంగతి అల్లునికి తెల్వనీయొద్దు!" ఎక్కడ పరువుపోతుందో అనే భయం పెద్ద కోడలు ముఖం మీద కన్పించింది.

"నా తల్లి అన్నెం పున్నెం ఎరుకలేనిది ఏం మాట్లాడుతున్నరే మీరు! నా తల్లిని ఏ కామపిశాచమో పట్టుకుంది! నీళ్ళాడే ముందల ఆదివారం తలకు పోసుకోవద్దే అంటె వినలేదు. ఆ రోజే రావిచెట్టు కింది నుంచి దాని చిన్నాయన ఇంటికి పోయింది. అప్పుడే అనుకున్న ఇదంతా ఏం బాగ జరుగలేదని - అప్పుడే ఆ పిశాచం దాని పెయి మీదికి వచ్చింది. ఆ కామ పిశాచమే దాని నోట రాజా రాజా అని అనిపించింది. నా తల్లో ! మమ్ముల్ని అన్యాలం చేసి పోతివి!" అని వీరమ్మ దు:ఖంలోనే జరిగిందంతా జ్ఞాపకం చేసుకుంది.

రాత్రి గౌరి నొప్పుల సమాచారం అందగానే వెంకటయ్య బస్సు దొరకకపోయినా లారీలో పడి ఓ రాత్రి నక్రేకల్లు చేరుకున్నాడు. అప్పటికే అంతా అయిపోయింది! గౌరి ఈ లోకంలో లేకుండా పోయింది.

"రాణీ! రాణీ!" అని గుండెలోనే పిలుచుకొని భోరున ఏడ్చాడు వెంకటయ్య. ఏడుస్తున్న అల్లున్ని చేసింది వీరమ్మ.

"నాయినా! మంచిగున్న నా బిడ్డను ఏ పిశాచమో పెయి మీదికి వచ్చింది. - ఎత్తుకపోయింది!" అని ఎక్కి ఎక్కి ఏడ్చింది వీరమ్మ!

"పిశాచమా !" అన్నాడు వెంకటయ్య ఏడ్పు ఆపకుండానే.

"అవున్నాయినా! కామపిశాచం!" అంది వీరమ్మ.

* * *